# బండూ చేసే మజా



**పని చేసి చేసి** బండూ ఒళ్లు హూనమయిపోయింది. రోజూ రెండూ రెండున్నర గంటల అదనపు పని... శనివారం, ఆదివారం కూడా! ఈ నెల్లాళ్లలో ఆఫీసు టైములో బండూ ఒక్కసారి కూడా చక్కర్లు కొట్టలేదు.

దగ్గర్లో ఉన్న బ్రహ్మాండమైన తగ్గింపు ధరల అమ్మకాల స్టాలుకేసి కన్నెత్తి కూడా చూడలేదు. అంతేనా? ఆఫీసు టైములో ఆఫీసు ఫోన్లో స్నేహితులతో పిచ్చాపాటీ మాట్లాడే జన్మహక్కును కూడా వినియోగించుకోలేదు. రోజుకి అయిదారుసార్లు టీ ఇచ్చి పుచ్చుకోవడాలకీ, పదిపన్నెండు

సిగరెట్లు తాగడానికీ, గంటగంటకీ కొలీగ్స్‌తో పని ఎంత ఎక్కువగా ఉందో వాపోవడానికి అయ్యే టైమును మినహాయిస్తే బండూకి క్షణం కూడా తీరికలేదనే అనవచ్చు. ఈ ఓవర్‌టైమ్ పని అలుపు తీరాలంటే ఫ్రెండ్స్‌తో నాలుగు కబుర్లు చెప్పుకోవడం చాలదనీ, బ్రహ్మాండంగా మజా ఉడాయించి తీరాలనీ బండూకి అనిపించింది. జేబులో గలగలలాడుతున్న ఓవరుటైము డబ్బులు అవునుసుమా అంటూ వంతపాడాయి.

పెళ్లయి ఇన్నేళ్లయినా పెళ్లాంతో ఏం చెప్పాలో, ఏం చెప్పకూడదో బండూకి తెలిసిరాలేదు. అందుకనే కాబోలు, తన బుర్రను దొలుస్తున్న ఊహ గురించి స్నేహలతతో చెప్పేశాడు. ఈ చెవినుంచి ఆ చెవిదాకా సాగిన నవ్వు కూడా జోడించాడు.

మామూలు రోజుల్లో ఇలా మాట్లాడడం, ఇలా గజంపన్నా నవ్వు నవ్వడం బండూకి ముప్పు తెచ్చి వుండేది. మగ పదార్థానికి పెళ్లంటూ జరగడమే అమితానందదాయకమైన విషయం కాబట్టి వారికి ఏ యితర సరదాలు ఉండక్కర్లేదని అమాంబాపతు అర్ధాంగుల నమ్మకం. అంచేత వాళ్లు బతికి ఉండగానే మొగుడు తన అవారా ఫ్రెండ్స్‌తో కలిసి మజా చేయడంకంటే ఘోరమైన కృతఘ్నుతలేదని వాళ్ల ఉద్దేశ్యం.

కానీ మొగుడు చచ్చీ చెడి, చెమటోడ్చి ఓవర్‌టైమ్ అలవెన్సో, బోనస్సో ఇంటికి తెచ్చినప్పుడు పెళ్లాం కళ్లల్లో కాస్త జాలి తొణికిసలాడుతుంది. ప్రస్తుతం స్నేహలత అటువంటి దశలోనే ఉంది. అందుకే "సరే, కానివ్వండి మీ ఇష్టం" అనేసింది.

"అంటే ఉద్దేశ్యం మాత్రం ఉందనుకో"

"ఓవర్‌టైం డబ్బులెన్ని వచ్చాయేమిటి?"

"ఏదో అటూ ఇటూగా పద్దెనిమిదొందలనుకో..."

"అలా అయితే ఫర్వాలేదు. ఏదో కాస్త ఎంజాయ్ చేయడంలో తప్పులేదు" అంటూ అతి ఉదారంగా అనుమతిచ్చేసింది స్నేహలత.

"అదేగామరి! అందుకే నేను నానూ ఇంటికి వెళతాను. అక్కణ్ణుంచి మేం ఇద్దరం కలిసి జగ్గూ ఇంటికి వెళతాం. ఆపైన విశూ ఇంటికి కబురంపిస్తాం" బండూ ఆరంభించేడు.

"...ఆ తర్వాత అందరం కలిసి వెకిలి వేషాలేస్తాం. బయటికెళ్లి భోంచేస్తాం... ఇంతేగా?" అంటూ మొగుణ్ణి వెక్కిరించింది స్నేహలత.

భార్య వెటకారాన్ని గమనించకుండా 'భలే కరెక్టుగా చెప్పావే!' అంటూ బండూ మెచ్చుకున్నాడు.

"సర్లెండి... ఇదిగో, చెప్పింది విని పదేసి రూపాయల ప్లేట్ మీల్స్ తెప్పించండి. క్రితంసారిలా మనిషికి అరవై రూపాయలు తగలేయకండి" బుర్రా, బుద్ధీ ఉన్న మనుష్యులు ఇంటి భోజనాన్ని కాదని అంతలేసి డబ్బుపోసి హోటల్లో ఎందుకు తింటారో స్నేహలతకెన్నడూ అర్థంకాదు.

"భలే చిత్రంగా మాట్లాడతావే! పది రూపాయలు ఏ మూలకి? నా ఓవర్‌టైమ్ పార్టీ ఆయే! నన్ను దోచుకుతినకుండా వదిలిపెడతారా మావాళ్లు?" బండూ విరగబడి నవ్వేడు.

"అలా దోచుకుతిననివ్వడమెందుకో" ఈవిడ సందేహం.

"దాంట్లోనూ ఓ మజా ఉంది తెలుసా?"

"బ్రహ్మాండంగా ఉంది. మీరు చెప్పేదెలా ఉందంటే కత్తెర, బ్లేడు, చాకు ఏది దొరికితే అది పట్టుకుని జనాలు తమరి జేబులు కొట్టేస్తుంటే తమరు ఉబ్బితబ్బిబ్బై 'భలే హాయిగా

ఉందోయ్, ఇంకా కొట్టేయండి' అంటారన్నమాట! బావుంది వరస!"

"ఓ ఫ్రెండు మరో ఫ్రెండు జేబుకొట్టేయకపోతే లాభమేమిటి? అసలు ఫ్రెండ్సు ఉన్నదెందుకంట?"

"ఆ మాత్రం భాగ్యానికి ఫ్రెండ్సెందుకు? అంత సరదాగా ఉంటే చెప్పండి. నేనే జేబు కొట్టేస్తాను. కావాలంటే రోజూ కొట్టగలను కూడా" అసలు ఇప్పటిదాకా మొగుడిజేబుకొట్టని ముద్దరాల్లా మాట్లాడింది స్నేహలత.

ఫ్రెండ్సుకి మాత్రమే ఒకరి జేబులు మరొకరు కొట్టుకునే హక్కు ఉంటుందన్న చిన్న విషయం కూడా స్నేహలతకెందుకు అర్థం కాదో తెలియక బండూ నివ్వెరపోయి సోదాహరణంగా వివరించబోయేడు.

"చూడు, ఇప్పుడు నీ ఫ్రెండ్స్ ఉన్నారనుకో, ఒకరి పర్సులొకరు కొట్టేసుకుంటారా లేదా? పార్టీ లిచ్చుకుంటారా లేదా?"

"పర్సులు కొట్టడం జాన్తానై. పార్టీలు మాత్రం ఇచ్చుకుంటామనుకోండి!"

"మరి పది రూపాయల్లో ఖర్చంతా ఎత్తిపోతుందా?"

"కాకపోతే? క్రితం ఏడాది నలుగురు ఫ్రెండ్స్‌కి రెండుసార్లు పార్టీలిచ్చాను. సమోసా, కచోరీ, నిమ్మకాయ షర్బత్తూ... మొత్తం పన్నెండు రూపాయలైంది. పై రెండు రూపాయలూ వాళ్లిచ్చేస్తామన్నారు. తలా అర్ధరూపాయీ పర్సుల్లోంచి తీశారు కూడా. నేనే వద్దనేశాను. పోన్లెండే, అదీ నేనే ఇచ్చేస్తానన్నాను"

"హార్నీ..."

"అప్పటికీ తీసుకో, తీసుకో అన్నారు కూడా. తర్వాత కూరగాయల కొట్లో నేను కొబ్బరికాయకు మూడు రూపాయలివ్వవలసి వస్తే దాంట్లో రెండ్రూపాయలు వాళ్లిచ్చేశారు" ఆడవాళ్ల నిజాయితీ గురించి స్నేహలత నొక్కి చెప్పింది.

బండూకి కళ్లు తిరిగేయి. "రక్షించావురా దేవుడా! ఆడదానిగా పుట్టి ఉంటే అంతే సంగతులు" అని పైకే అనేశాడు.

"ఆడదానిగా పుట్టాలంటే కాస్త తెలివితేటలుండాలి. అవిలేవు కాబట్టే దేవుడు మిమ్మల్ని మగాడిగా పుట్టించాడు. ఇప్పుడింక చేసేదేముంది? అది సరే! అసలు విషయం తలకెక్కిందా? లేదా? పది రూపాయలు చా...లా ఎక్కువని!"

"ఆ చా...లా... నీకేమో మాకు కాదు. మాకది బహు తక్కువ. మాకసలు బడ్జెట్టే లేదు. ఎంత కావాలంటే అంత ఖర్చు చేస్తాం"

"ఇంకేం మరి... తమరిష్టమే కానీండి" పోయి గంగలో దూకండి అన్న స్టయిల్లో అంది. మొగుణ్ణి అదుపుకొట్టేదేకానీ కష్టపడి ఓవర్‌టైం డబ్బు బాగా సంపాదించాడు కదాన్న ఉద్దేశ్యంతో ఊరుకుంది.

సరిగ్గా అప్పుడే, బండూ హఠాత్తుగా పడిపడి నవ్వసాగేడు.

"దీనిలో నవ్వేందుకేముంది?" స్నేహలత చికాకుపడింది.

"ఇదికాదు, నేనో ఫస్ట్‌క్లాసు జోక్ చేశా... హఁహఁ" బండూ నవ్వుతూ భార్య వీపు మీద చరిచేడు. కాస్సేపయ్యాక మళ్లీ నవ్వి ఇంకోటి చరిచేడు.

"ఇదెక్కడి ఖర్మరా దేవుడా! మీకేం మతీగితీ పోలేదుకదా!" అంటూ సురక్షితమైన దూరంలో నుంచొని మొగుడికేసి అనుమానంగా చూసింది.

"ఆ వినూ లేదూ..." అంటూ తెరలుగా వచ్చే నవ్వాపుకుంటూ భార్యవీపు మీద చరవడానికి బండూ ముందుకొచ్చాడు.

"అట్టే అట్టే దూరం దూరం" అంటూ స్నేహలత పారిపోసాగింది.

"గొప్పదానివే! నీ వీపు మీద చరవనివ్వవ్! మరి జోకెలా చెప్పను?"

"అదా సంగతి! అయినా తెలీకడుగుతాను జోకు వినడానికీ వీపు బాదించుకోడానికీ సంబంధం ఏమిటండీ?" కళ్లు తిప్పుతూ స్నేహలత అడిగింది.

"మరింకేమనుకొన్నావ్? మా ఫ్రెండ్సంతా ఒకరికొకరు జోక్స్ చెప్పుకునేటప్పుడు వీపుమీద చరిచి చెప్తాం. అంటే నేను నానూకి జోక్ చెప్తున్నాననుకో నానూ వీపు మీద ఓ చరుపు చరుస్తానన్నమాట! ఆ జోక్ అర్థం కాగానే నానూ జగ్గూవీపుమీద చరుస్తాడన్నమాట! అప్పుడు అంతమంచి జోక్ చెప్పినందుకు జగ్గూ నా వీపు చరుస్తాడన్నమాట. ఆ తర్వాత మేమందరం నవ్వుతో ఉక్కిరిబిక్కిరవుతూ ఒకళ్లవీపు మరొకళ్లు చరుచుకుంటామన్నమాట" వివరణ ఇచ్చిన సంతోషంతో భార్య వీపు మీద చరుపు చరవడానికి ముందుకు దూకేడు.

స్నేహలత తప్పించుకుంటూ, "నాకొద్దీ చరుపులు. కావాలంటే గోడమీద వేసుకోండి" అంది.

"చాల్లే తెలివి. అలా జోక్స్ చెప్పుకుంటే మజా ఏముంది? ఏం? మీ ఫ్రెండ్స్ జోక్స్ చెప్పుకొనేటప్పుడు వీపులు చరుచుకోరా?"

"...కోం"

"కొంచెం కూడా?"

"కొంచెం కూడా... మరీ నవ్వొస్తే పైటలో మొహం దాచుకుంటాను"

"అఘోరించావు. ఇది ఒక ఫ్రెండ్‌షిప్పా? యూస్‌లెస్, ఫెడీల్ ఫెడీల్మని వీపులు చరుచుకోవాలిగానీ ఇదేమిటి? యూస్‌లెస్"

"యూస్‌లెస్ అయితే కానివ్వండి. ఆ జోకేదో ముందు అది చెప్పండి చాలు" బండూనీ, బండినీ పట్టాలమీదకు తెచ్చే ప్రయత్నం చేసిందామె.

బండూ మళ్లీ నవ్వు మొదలెట్టాడు. "ఆ వినూలేదూ... ఇడియట్"

"ఎప్పుడు చూసినా అతణ్ణి ఇడియట్ అంటారు. అతను మీ ఫ్రెండుకదా!"

"ఫ్రెండుకాబట్టే ఇడియట్ అంటాను. నిన్నంటానా? అనను. ఎందుకు? ఎందుకంటే నువ్వు ఫ్రెండ్‌వి కావు. పెళ్లానివి. అందువల్ల నిన్ను యూస్‌లెస్ అని మాత్రమే అంటాను" బండూ ఫ్రెండుకీ, పెళ్లానికీ గల తారతమ్యాలు విశదీకరించేడు.

"ఇక వ్యాఖ్యానాలు చాలుకానీ, అసలు విషయానికి రండి"

"నేను వాడికి ఫోన్‌చేసి చెప్పా. 'మీ ఆవిడని తీసుకొని ప్రీతి సంగమ్ హోటల్‌కి డిన్నర్‌కి రారా' అని"

"బాగానే ఉంది. దీంట్లో జోకేముంది?"

"బోల్డంత ఉంది. ఎందుకంటే మేమంతా డిన్నర్‌కి వెళ్లేది ఆలీబాబా హోటల్‌కి" బండూకి నవ్వినవ్వి పలకమారింది.

"అంటే మీరు వినూని, శాంతని మోసం చేస్తున్నారన్నమాట"

"కరెక్టు! వాళ్లని వెర్రిఆళ్లని చేస్తున్నామన్నమాట"

"స్నేహలత కోపంతో అరిచింది. "ఇది జోకా! నా పిండాకూడు. ఇది దగా, పచ్చి

మోసం! ఒక ఫ్రెండుతో వ్యవహరించే తీరు ఇదా? సిగ్గుసిగ్గు"

బండూ తన ధోరణిలో తనున్నాడు. "వాడు చవటమొహం వేశాక వాళ్లావిడ అందుకుంటుంది చూడు... తిట్టిపోస్తుంది. మెటికలు విరుస్తుంది. పట్టుకుని ఉతికేస్తుంది. వెధవని. హేఁ హేఁ"

"పాపం అతణ్ణలా ఏడిపించుకు తినడమెందుకంట?"

"ఎందుకంటే వాడు పెళ్లయిన తర్వాత ఒక్కసారి కూడా ఇంటికి భోజనానికి పిలవలేదు కనక. తెలిసిరావాలిలే"

"కానీ దీనివల్ల మీ స్నేహం చెడిపోదూ! మాటలు పోతే?"

"చాల్లే, చెప్పొచ్చావు. ఇటువంటివాటి గురించి సంవత్సరాల స్నేహానికి మంగళం పాడడానికి మేమేమైనా ఆడాళ్లమా? మొగాళ్లంటే ఎటువంటి వాళ్లో తెలుసా? క్రితంసారి బురదలోకి తోసేశాం. కూర్చోబోతూంటే వెనుకనించి కుర్చీలు లాగేయడం ఎన్నిసార్లు జరిగిందో లెక్కేలేదు. అయినా స్నేహం గట్టిగా నిలిచింది కదా!" మగ స్నేహం, ఆడస్నేహం యొక్క తారతమ్యాలు కూడా బండూ వివరించవలసి వచ్చింది.

"ఇంత చేసినా అతనికి కోపం రాదంటారు?"

"ఎందుకు రాదు? మహారాజులాగ వస్తుంది. తిడతాడు, అరుస్తాడు. జన్మలో నీ మొహం చూడనంటూ రంకెలేస్తాడు"

"తర్వాత"

"మేమేమైనా ఊరుకుంటామా? వాడాఫీసుకి వెళ్లి వాడి ఎదరే కూచుంటాం. లేకపోతే ఇంటికెళ్లి తిష్టవేసి, వాడికి వ్యతిరేకంగా నినాదాలిస్తాం. దాంతో వాడికి తిక్కరేగి తిట్టిపోస్తాడు. ఓ నాలుగు లెంపకాయలేస్తాడు, నన్ను కొడతాడు. చివరికి వాడు తిట్టికొట్టి అలిసిపోయేక మేమందరం వాణ్ణి భోజనానికి హోటల్‌కి ఈడ్చుకుపోతాం!"

ఈ వింత మిత్రులగాథ విని స్నేహలత విస్తుపోయింది. మొగుడికి కాస్త స్క్రూ లూజని ముందునుంచీ అనుమానమే కానీ చూస్తుంటే పూర్తి పిచ్చాడేమోననిపించింది. తనొక్కడే కాదు యావన్మంది స్నేహితులూ అదే బాపతులా ఉన్నారు.

బండూకి ఈ కబుర్లతో చాలా లేటపోయిందనిపించింది. గబగబా తయారవ్వడం మొదలెట్టాడు. బండూ గబగబా తయారవ్వడం అంటే స్నేహలతకు మూడిందనే అర్థం. ఎందుకంటే కావలసిన వస్తువులు కనబడకపోవడం, చేతికందిన వస్తువులు పడేయడం లేక పోగొట్టుకోవడం, సరైన టైముకి చొక్కా బొత్తమో, బూటు లేసో తెంపుకోవడం వగైరాలు మొగుళ్ల ప్రత్యేక లక్షణాలు అనుకుంటే బండూలో అవన్నీ గూడుకొట్టుకుని ఉన్నాయి. స్నేహలతకు అవన్నీ ఓసారి మళ్లీ దర్శనమిచ్చాయి.

ఇంత హడావుడిలో కూడా పతిదేవుడు ఎంజాయ్ చేసే విధానమూ, దానికి కాబోయే ఖర్చూ తెలుసుకోవాలన్న తాపత్రయం స్నేహలతను వదిలిపెట్టలేదు!

"ఇంతకీ ఏం తేల్చారు? ప్లేటు పదిరూపాయలా? లేక ఏకంగా ఇరవై రూపాయలు ఖర్చు పెట్టేస్తారా?" అని అడిగి చూసింది.

"భోజనానికి చాలా టైముందికదా! దానికి ముందు భేల్‌పూరీ, పానీపూరీ అవీ ఇప్పించాలిగదా, దానికి తలా అయిదు రూపాయలవుతుంది. ఆ పైన కుల్ఫీకూడా ఇప్పించాలా? దానికీ తలా అయిదూ" బండూ తన కార్యక్రమాన్ని కొద్దిగా రుచి చూపించాడు.

"అలా అయితే ఆకలి చచ్చిపోతుందిగా. పదిరూపాయల..."

"భలేదానివే. ఎలా చచ్చిపోతుంది? పైగా పెరుగుతుంది. తెలుసా?"

"ఆకలి పెంచడానికి నలభై రూపాయలా?" స్నేహలత గుండె జారిపోయింది. "తర్వాత?"

"తర్వాత మేం సరదాగా చౌపాటీనుండి నారిమన్ పాయింట్‌దాకా తిరుగుతాం"

"పోన్లెండి, దానికి ఖర్చేం అవదుగా!"

"అలాగేం చెప్పలేం! దార్లో వేరుసెనక్కాయలవాళ్లు ఎలాగూ తగుల్తారు. చూస్తే పంటికిందకి ఏదో కొనబుద్ధవుతుంది!"

స్నేహలత మనస్సులో వేస్తున్న లెక్కలో పదిరూపాయలు పెరిగింది. "పోనీ తర్వాతైనా భోజనానికి వెళతారా?" అనడిగింది.

"అబ్బే, తర్వాత టాక్సీలో జుహూ వెళతాం"

"అక్కడకెందుకు?" అంత తొందరలో కూడా టాక్సీ ఛార్జికి అరవై, డబ్బై రూపాయలు ఖర్చుకి కలిపింది.

"ఎందుకేమిటి? కొబ్బరిబోండాలు తాగడానికి!"

"అవి ఎక్కడైనా దొరుకుతాయిగా"

"ఆ మాటకొస్తే ఏ ఆస్పత్రి బయటైనా దొరుకుతాయి బోండాలు. జుహూలో బోండాలంటే వాటి సంగతేవేరు."

"ఒక్కొక్కళ్లు ఎన్నేసి తాగుతారంటారు?" బోండానికి మూడు రూపాయల చొప్పున ఎంత ఖర్చవుతుందో చూడాలని ఆవిడ తాపత్రయం.

"అలా ఎలా చెప్పగలుగుతాం? తీరా అక్కడి దాకా వెళ్లిన తర్వాత అసలు బొండం తాగ బుద్ధి కాలేదనుకో!..."

"నేను చెప్పినమాట విని జుహూ వెళ్లకండి" అంటూ ఖర్చు తగ్గించే ఉపాయాన్ని చెప్పబోయింది స్నేహలత.

"వెళ్లకపోయినా వెళ్లకపోవచ్చులే! దానికి బదులు ఓర్లి వెళ్లి బియర్ తాగుదామంటారేమో!"

బియర్ సీసాలలెక్క వేస్తుంటే బియర్ తాగకుండానే స్నేహలతకు బుర్ర తిరిగిపోయింది. "ఇదిగో ఇలా తగలేసే మాటయితే నేను డబ్బు ఇవ్వనుసుమా" అనేసింది.

"నాకు తెలియదా నీ సంగతి! అందుకే ఆఫీసునుండి ముందే ఎడ్వాన్స్ తీసేసుకున్నా! హ్హహ్హ"

"ఎంత?" గొంతులో ఓటమి ధ్వనించింది.

"ఓ వెయ్యి ఉంటుందిలే" మహా బేఫర్వాగా బండూ అన్నాడు చొక్కా తొడుక్కుంటూ.

"వెయ్యా?" స్నేహలత కెవ్వున కేకపెట్టింది.

"అవుతుందిలే. ఓవర్‌టైమ్ చేసిన అలసట తీరాలంటే తప్పదుమరి" ఓదార్పుగా అనేసి బండూ బయటకి వెళ్లిపోయేడు.

"ఇదిగో వింటున్నారా?" అని అరుస్తూ వెంటబడబోయింది. అప్పటికే బండూ జారుకున్నాడు. తలపట్టూక్కూచోడం తప్ప ఇంకేం చేయలేకపోయింది. ఖర్చు లెక్క ఎంతకు చేరిందో అజాపజా తెలియలేదు.

ఇలా డబ్బు తగలేసే దానికి కష్టపడి ఓవర్‌టైమ్ చేయడమెందుకన్న మీమాంసలో పడింది స్నేహలత. తనకు తట్టిన ఈ ప్రశ్న బండూకెందుకు తట్టలేదన్న ప్రశ్న మరొకటి మొలుకొచ్చింది.

కాస్సేపటికి అన్ని ప్రశలకూ దేవుడే జవాబుదారీ అనుకొని ఆలోచనలకు ఆనకట్టవేసింది.

ఆనకట్ట వేయడానికి మరో కారణం కూడా ఉంది. వినూ, శాంతల ప్రహసనాన్ని ఆపవలసిన బాధ్యత తనమీద ఉందని స్నేహలత గ్రహించింది. బందూ ప్లాను ప్రకారమే అన్నీ జరిగితే వినూ, శాంతా అవమానం పాలు కావడం ఖాయం. అది ఆమెకు రుచించలేదు. ముఖ్యంగా శాంత తన ఫ్రెండు కావడం చేత తనకి ముందుగా తెలిసి కూడా ఈ అఘాయిత్యాన్ని ఆపలేదని శాంతకు తెలిస్తే తనని క్షమించలేదు. మగాళ్ల తప్పుల్ని ఉదారబుద్ధితో చూడగలిగినా సాటి ఆడదాని పొరపాట్లని మగువ మన్నించగలదా?

అందుకే పదిహేను రూపాయలు ఖర్చయినా ఫర్వాలేదని టాక్సీ యెక్కి స్నేహలత వినూ ఇంటికెళ్లింది. మెట్లెక్కి రొప్పుతూ, రోజుతూ వాళ్ల గుమ్మం దగ్గరికి వెళ్లేసరికి వినూ, శాంతా బయటికొస్తున్నారు. తనని చూడగానే శాంత నవ్వుతూ, "నువ్వు బందూ గారితో కలిసి వెళ్లలేదా? మమ్మల్ని వెంటబెట్టుకుని రమ్మని నిన్ను పంపారా?" అంది.

"నేనసలు వచ్చేదాన్నేగాదు" అంది స్నేహలత.

"అదేం?" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"నన్ను పిలిచిన వాళ్లెవరు?"

వినూ నవ్వి, "తమాషాగా ఉందే! ఈ బందూగాడి బుర్ర బూజు పట్టిపోయినట్టుంది. ఫ్రెండును సతీసమేతంగా ఆహ్వానించడం, భార్యను మాత్రం మర్చిపోవటం. ఇడియట్! ఇదిగో వదినగారూ, నేను ఆహ్వానిస్తున్నాను మిమ్మల్ని, మాతో రండి" అన్నాడు.

"ఏవండోయ్ నన్నేకాదు, మిమ్మల్నీ పిలవలేదు" స్నేహలత గుట్టు బయటపెట్టింది.

"అదేమిటండీ అలా అంటారు? ప్రీతి సంగమ్ హోటల్‌కి మా అందర్నీ పిలిచారుగా"

"మిమ్మల్ని ఏడిపించాలని వేసిన ప్లానండీ బాబూ అది! వాళ్లందరూ ఆలీబాబా హోటల్లో డిన్నర్ ఏర్పాట్లు చేసుకుని మిమ్మల్ని మాత్రం ప్రీతి సంగమ్‌కి వెళ్లమని చెప్పారు"

"ఆలీబాబానా? హోటల్ ఆలీబాబాయేమోగానీ నలభై దొంగలు మాత్రం వీళ్లే! బద్మాషులు, దొంగపీనుగులు, సన్నాసులు"

"...సిగ్గుమాలిన వాళ్లు అని కూడా అందామనుకుంటున్నారా?"

"అవును. గుర్తుకొచ్చింది. సిగ్గులేని శుంఠలు, ద్రోహులు..." వినూకి తిట్లు వెతుక్కోవడం ఓ సమస్య అయిపోయింది.

"మీ తిట్లు బాగానే ఉన్నాయిగానీ పదండి, తలుపు తెరవండి. బియ్యం కడిగి అత్తెసరు పడేస్తాను" అంది శాంత భవిష్యత్ కార్యక్రమం రూపొందిస్తూ.

"అత్తెసరు ఏం ఖర్మ? భోజనానికి పిలిచారుకదా సన్నాసి వెధవలు. ఆలీబాబా హోటల్‌కే వెళ్లి వాళ్ల పనిబడదాం. వాళ్ల కాలరట్టుకొని డిన్నరిమ్మంటాను" వినూ పట్టుబట్టాడు.

"కాలరట్టుకొంటారో, కాళ్లే పట్టుకొంటారో మీరెళ్లండి కావలిస్తే. నేను మాత్రం రాను" శాంత తెగేసి చెప్పింది.

స్నేహలత కూడా ఇంకాస్త సమాచారం బయట పెట్టింది. "వాళ్లు ఆలీబాబాలో దొరుకుతారన్న నమ్మకం ఏముంది? ఏవేవో పెద్ద ప్రోగ్రాములు పెట్టుకున్నారు"

"ఓహో! ఈ సన్నాసి వెధవలకు అతి తెలివితేటలు కూడానా! చూడండి వీళ్లని ఇంటికి భోజనాలకి పిలుద్దామనుకుంటున్నాను కూడాను. విశ్వాసఘాతకులు, సైతాన్లు" ఇంకో కొత్త తిట్టు తట్టినందుకు వినూ మొహం ఇంతైంది.

"నాకు తెలీకడుగుతాను. వాళ్లతో పూసుకు తిరగడం ఎందుకు? ఇలా తిట్టుకోవడం ఎందుకు?" అని ప్రశ్న లేవనెత్తింది శాంత.

"చాల్లే, పూసుకోవడమా? చూడు యిప్పుడే వెళ్లి అలీబాబాలో వెధవల్ని ఒడేసి పట్టుకుని మనమధ్య ఫ్రెండ్‌షిప్ రాంరాం అని చెప్పేసి వస్తాను. వీళ్ల వ్యవహారం ముదిరిపోయిందే, ఓహో ఎందుకెందుకాని ఊరుకున్న కొద్దీ, మరీనూ" వినూ ఆవేశంతో ఊగిపోతున్నాడు.

"అలీబాబాలో లేరంటున్నానుగా" స్నేహలత గుర్తు చెయ్యబోయింది.

'అక్కడ దొరకక్కపోతే వేరేచోట వెతుకుతాను. ఊళ్లో హోటళ్లన్నీ గాలిస్తాను. పట్టుకుని నాలుగూ అడిగేస్తాను, కడిగేస్తాను. స్నేహలతగారూ, నిజమైన ఫ్రెండంటే మీరు. మీ ఆయనున్నాడే ఈ దొంగల ముఠాకు నాయకుడు వాడే. చూస్తూ ఉండండి. వాడి పని పడతాను. అదిరిపోవాలి దెబ్బకి!" వినూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

ఆ రోజు రాత్రి శాంత, స్నేహలత తమ తమ ఇళ్లల్లో పెరుగన్నం, ఊరగాయతో భోజనాలు కానిచ్చి మంచాలెక్కేశారు. రాత్రి ఒంటి గంటన్నర ప్రాంతంలో తలుపు చప్పుడు వినబడి స్నేహలత ఉలిక్కిపడి లేచింది.

"ఎవరూ?" అంది కాస్త బెదురుతూనే.

"నేనండీ, వినూని. బండూ వచ్చాడా?" అంది వినూ గొంతు.

"మీరా? ఆయనింకా రాలేదండీ"

"సరేలెండి... పిరికి సన్నాసులు ఎక్కడో దాక్కున్నారు. వదిలిపెడతాననుకున్నారా? పదరా సదూ, ఎక్కడున్నారో గాలిద్దాం." రెండు జతల పాదాల మెట్లు దిగిన చప్పుడు. అయితే ఈ స్నేహితుల సమరంలో సదూగారూ కూడా రంగంలోకి దిగేరన్నమాట అనుకొంది స్నేహలత.

అరగంట పోయేక మళ్లీ తలుపు చప్పుడు... "ఎవరు వారు?" స్నేహలత ఆచూకీ.

"నేను గజదొంగ బందిపోటు... ఎట్సెట్రాని, హాఁహాఁ తలుపు తీయవే బేలా, ఓ బాలా!"

బండూకి బియర్ నిషా తలకెక్కిందని స్నేహలతకి బోధపడింది. తలుపుతీసి "వినూగారూ కనబడ్డారా?" అనడిగింది.

"వాడా? మా కోసం వెతుక్కుంటూ తిరుగుతున్నాడేమో పిచ్చిసన్నాసి హాఁహాఁ"

"కాస్సేపటి కిందనే వచ్చి వెళ్లారు"

"భలే భలే!"

"ఎన్ని రూపాయల ప్లేటు తెప్పించారేమిటి?"

"ప్లేటా? భోజనమే చెయ్యందే!"

"అంటే?"

"అంటే వెళ్లేటప్పటికి బాగా ఆలస్యమవడం వలన హోటల్ మూసేశారు అని అర్థం."

"పోన్లెండి, మంచిదే, వచ్చి పడుకోండి"

"పడుక్కోవడమా? చాల్లే. పూనా వెళ్లాలి"

"పూనానా? !!!?"

"అవును పూనా వెళ్లి భోంచేయాలనుకున్నాం"

"భోజనానికి పూనాదాకా వెళ్లడం ఎందుకంట?"

"పూనాకి టిక్కెట్టు తీసుకొన్నాం కాబట్టి అంతగా అయితే మధ్యలో నెరుల్‌లో దిగి మాథెరాన్ వెళ్లచ్చు. అదీకాకపోతే లోనావాలాకైనా వెళ్లచ్చు హాఁహాఁ"

"నా శార్థంలా ఉంది"

"శార్థం, పిండాకూడూ పక్కనబెట్టి ముందు బట్టలియ్యి, బేగ్‌లో అన్నీ సర్దియ్యి. కింద టాక్సీలో పాపం వాళ్లంతా వెయిట్ చేస్తున్నారు. అందరం జగ్గూ ఇంటికెళ్లి పడుకొంటాం. వాళ్లావిడ ఊళ్లోలేదులే, తెల్లారి లేస్తూనే పూనాకి బయల్దేరతాం" బందూ బేగ్‌లో బట్టలు కుక్కుతూనే మాట్లాడుతున్నాడు.

"మీకు పిచ్చెక్కినట్టుంది" అంది స్నేహలత కచ్చగా.

"భలే కనిపెట్టావే, పిచ్చెక్కేనా మనసా... నీకు పిచ్చెక్కెనా మనసా" అని పాడుకుంటూ బందూ బయటకు వెళ్లిపోయాడు.

స్నేహలత తల పట్టుకుని గుమ్మం దగ్గిర కూలబడి అక్కడే పడి నిద్రపోయింది. తెల్లారుఝామున ఓ కల వచ్చింది. రంగులరాట్నం వంటి దాంట్లో అందరి తలకాయలూ గిరగిరా తిరుగుతున్నాయి. బందూ తలకాయ ఎక్కడైనా కనబడుతుందాని స్నేహలత వెతుకుతూండగానే కాలింగ్‌బెల్లు మోగింది.

"ఎవరూ?" స్నేహలత గొంతు వణికింది.

"భయపడకండి. నేనే వినూని, బందూగాడు వచ్చాడా?"

"వచ్చారు వెళ్లారు. పెట్టేబేడా సర్దుకుని పూనా ప్రయాణం కట్టేరు"

"అమ్మ దొంగవెధవలు! పూనా పారిపోయేరట్రా, వదిలిపెట్టేదిలేదు. రంద్రా సదూ, చందూ! వెళ్లి పట్టుకొందాం"

"ఏవండోయ్..."

వినూ ఏమీ వినిపించుకోకుండా తన ఇద్దరు మిత్రులతోనూ వెళ్లిపోయేడు.

ఆ రోజు మధ్యాహ్నం శాంత స్నేహలత ఇంటికెళ్లి "వీళ్లంతా మజా ఉడాయిస్తోంటే మనం మాత్రం నోరు కట్టుకు కూచోడమేం? మనమూ పార్టీ చేసుకుందాం. నేనిస్తా పార్టీ రా!" అని పిలిచింది.

"తప్పకుండా, రా పోదాం" అని స్నేహలత బయల్దేరింది.

ఇద్దరూ మిఠాయి కొట్టుకెళ్లి గులాబ్‌జామ్ దాల్మోర్ తిని లస్సీ తాగేరు. బిల్లు పదమూడున్నరయింది.

""అపైె మూడున్నర నేనిచ్చేస్తా"నంది స్నేహలత.

"వద్దులే అవీ నేనే ఇచ్చేస్తాను" అంది శాంత.

స్నేహలత సరేనంది. కానీ తర్వాత బజార్లో శాంత కొబ్బరికాయలు కొనేటప్పుడు మూడు రూపాయలూ, ధనియాలు కొనేటప్పుడు అర్ధరూపాయీ ఇచ్చేసింది.

ఈ విధంగా ఎంచి, తూచి మజా చేసుకున్నాకా ఇద్దరూ కలిసి తమ మొగుళ్లు ఎంత తెలివితక్కువాళ్లో, ఎంత జల్సా చేస్తారో తలుచుకొని, తనివితీరా తిట్టుకుని వాళ్లవాళ్ల ఇళ్లకు బయల్దేరారు.

(గంగాధర్ గాడ్గీళ్ మరాఠీ రచనకు అనువాదం,
విపుల డిసెంబరు 1996 లో ప్రచురితం)

